# రిక్షా

జెండా మీది అశోక చక్రంలా వున్నాయి రిక్షాచక్రాలు.

రిక్షామీది ధర్మయ్య భద్రకాళి గుడికి వెళ్లే రోడ్డు ముందు సవారీ కోసం ఎదురు చూస్తున్నాడు.

"ఏయ్ రిక్షా..."

"సార్..."

"వస్తావా"..."

తలూపాడు ధర్మయ్య.

"రామన్నపేట..."

"రామన్నపేటలో ఏడకి పోవాలె?"

"గాంధీ బొమ్మ"

సరేనన్నట్లు తలూపాడు ధర్మయ్య.

"ఎంత ఇయ్యమంటావు"

"ఎందరు? ఇద్దరా సార్..."

"ఆ... ఇద్దరం"

ఆ సార్ వెంట ఓ అమ్మాయి వుంది.

ఇద్దరి మొహాల్లో దిగులు వుంది.

"గాంధీ బొమ్మ దగ్గర్నె దిగుతారా సార్?"

"ఆ అక్కడే నేనైతే రోడ్డుకివతల్నే దిగుతాను"

"అమ్మను గాంధీబొమ్మ దగ్గర దింపాల్నా సార్?"

"ఆ..."

"మూడు రూపాయలు ఇయ్యిండ్లి"

"సరే పద..."

ఆ సార్, ఆ అమ్మాయి కూర్చున్నారు.

రిక్షా కదిలింది.

"వివేక్..."

"ఉ"

సార్ పేరు వివేక్.

"చెప్పు వందనా..."

అమ్మాయి పేరు వందన.

"మన పెళ్ళి జరుగుతుంది కదూ?"

"తప్పక-"

"నాకు భయంగా వుంది వివేక్..."

"భయమెందుకు?"

"మా అమ్మానాన్నల మొండిపట్టు నాకు తెలుసు. మన పెళ్ళికి ఒప్పుకోరేమో అనిపిస్తుంది"

"ఒప్పుకొని తీరుతారు"

"నీదాన్ని కాకపోతే నేను బతకలేను వివేక్... ఏ ఎలుకల మందో తిని చచ్చిపోతాను".

"అంత మాటనకు వందనా. నువ్వు చదువుకున్న దానివి. నలుగురికి ఆదర్శంగా వుండాల్సిన దానివి. ఇంత పిరికిగా ఆలోచిస్తావా చెప్పు? మనం చేస్తున్నది తప్పు కానప్పుడు ఎదిరించే వాళ్ళతో చివరి క్షణం దాకా పోరాడటం మన ధర్మం. మా వాళ్ళ నుంచి ఏ ఇబ్బంది వుండదు. మీ వాళ్ళను ఒప్పించడానికి సర్వ ప్రయత్నాలు చేద్దాం. లేకపోతే రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుందాం."

"నిజంగానా వివేక్?"

"నిజం వందనా - నువ్వు దూరమైతే నేను మాత్రం బతుకగలనా..."

"వివేక్..."

***

"ఏంరా రామన్న పేట వస్తావా?"

భుజం మీద కండువాతో మొహం తుడుచుకుంటూ వస్తానన్నట్లు తలూపాడు ధర్మయ్య.

"రామన్నపేట ఏడ్కి పోవాలె షావుకారి?" అని అడిగాడు.

"గాంధీబొమ్మ తానికి"

"ఎందరు ఇద్దరా?"

"నేను అమ్మగారు"

"ఆ కూసోండ్లి ఐదురూపాయలియండ్లి"

"గీడ్నించి గాంధీబొమ్మ కాడికి ఐదురూపాయలా? మూడు రూపాలిస్త నీ ఇష్టం వుంటే రా లేకుంటే లేదు."

"నాలుగు రూపాలన్న ఇయిండ్లి షావుకారి. గాంధీబొమ్మ దగ్గరున్నాది శానా దూరం పోవాలె. అంతా చడావ్‌కాదు."

"మూడుంబావుల తీసుకో..."

"ఇంకొక్క మూడుపావుల కాడ కోశిష్ చేయకుండ్లి షావుకారీ. మీకు పాను తిన్నంత కాదు."

"నీ ఇష్టమైతే రా. లేకుంటే లేదు"

"పదది షావుకారి. పడ్తె రానా..."

"సరే లేరా. ఇంకో పావులా తీసుకో. మూడున్నర ఇస్తం తీయి. కూసోవయ్యా గా టాప్ తీయిరా" అన్నారు అమ్మగారు.

"గాంధీ బొమ్మ కాన్నె దిగుతారా?"

"ఆ"

షావుకారు అమ్మగారు కూర్చున్నారు.

రిక్షా కదిలింది.

"రొండు టికెట్లు తీసుకున్నా" అన్నాడు షావుకారి.

"ఆ నువ్వు రానంటివిగదా..." అన్నారు అమ్మగారు.

"అటెంక వొస్త, రొండు టికెట్లకు నలభైనాల్గు రూపాయలయిందా?

"పట్నంకు ఇద్దరికి బండి చార్జి నలభై నాల్గు రూపాయలయిందా? మొన్నటిదాకా ముప్పై దాకవుండె"

"చార్జీలు పెరిగినాయి"

"అవునట కదా"

"నేను చెప్పిందంతా మన్సుల పెట్టుకున్నావా"

"ఆ ఆ..."

"శానా జాగర్త. మీ తమ్మునికి అన్ని సంగతులు ఎరికే అనుకో. వందనను పట్నం తీస్కపోంగానే ఓ అర్రల వుంచుండ్లి. బైటికి పోనీయకుండ్లి. దానికి ఇవ్వన్ని ఏం తెల్వాయి. మేనమామ ఇంటికి ప్రభోజనానికి పోతాన అనుకుంటాంది. నేను పట్నం వచ్చేదాంక ఆడనే వుండుండ్లి. ఈ లోగా మనసు మార్చుకున్నదో సరేసరి. లేకపోతే దాని పెడరెక్కలు విరిచకట్టి మీ తమ్ముడు చూసిన పిలగానికిచ్చి చేద్దాం – ఓ పదివేలు ఎక్కువ ఇద్దాం – వాడే సర్దుకపోతడు–"

"అదేమన్న గడబిడ చేస్తదో...'

"పెళ్లయినంకనా?... పెళ్లయినంక ఇంకేం గడబిడ చేస్తది?... అయ్యేదాకనే మనం జాగర్తగా వుండాలె. నీకు నాకు తప్ప ఇక్కడ మూడో కంటికి మన ప్లాను తెల్వది. వందన పెళ్లి అయినంకనె మనం పట్నం నుంచి తిరిగి వొరంగల్లుల అడుగుపెట్టుడు.

"వాడు ఆడికి వొస్తడో..."

"ఆడికెట్ల వొస్తడు. వానికెట్ల తెలుస్తది. నువ్వు, నేను ఇంట్ల ఉండి ఏం చేస్తం. గొడ్ల కాస్తమా. ఇయ్యాట్నించి మీరు పట్నం పోయేదాక అది ఇల్లు కదుల్తదా..! రేపుపొద్దుగాల్నె కద మీరు పట్నం పోయేది. గింతల్నె వాడికి ఈ సంగతులన్ని ఎట్ల తెలుస్తయి. ఒక వేళ ఇయ్యాల వాళ్లు కలుసుకున్నా నువ్వు చూసిచూడనట్టు గమ్మున ఉండు. మన ప్లాను దానికి అర్థం కాదు. మారు మాట్లాడకుంట రేపు నీతోని పట్నం వొస్తది."

"గీ వుపాయం బాగనే ఉన్నది కాని... అదే పెళ్లి వూసుఎత్తితే ఏం చేయను?"

"ఎత్తితే – ఇప్పుడే మీ నాయినతాన గీ సంగతి తీయకమ్మా. మనం పట్నం పోయి

వచ్చినంక నేనే సందు సూసుకొని మెల్లగ చెప్తతీయి అను. పట్నం తీసుకపోయినంక దాని పెళ్ళి చేసే వాస్తం కదా..."

"ఆ కానీ..."

"కానీ ఏందే? కానీ... నీ అనుమానం నాకెర్కలే. ఇయ్యాల రేపట్లనే ఏవన్నా అయితదంటవా. దానికి అనుమానమె రాకపోతే ఏమయితది చెప్పు. ఇద్దరు కలిసి ఏడ్కిపోతరు?. పోతే పోలీస్ టేషన్ల రిపోట్ ఇయ్య వూకుంటాను. వాడు నా బిడ్డను ఎత్తుకపోయిండు అని కేసు బానాయించి టేషన్ల కూసోబెడ్తా - అన్నా నా దగ్గర్నా గీ ఆటలన్నీ..."

"సరేలే. రేపటి లోపల వాళ్ళెక్కడికి పోతరుగాని. నువ్వు మాత్రం నోరు ఇడ్సి గీ సంగతి ఎవరితోని అనకు - "

"ఛా... నేనెందుకు చెప్త. నువ్వు మాత్రం పట్నంల జాగర్తగ వుండు. ఆడినుంచి ఆ వివేక్‌గానికి అది ఉత్తరాలు పత్తరాలు రాయకుండా సూడు.."

"గయన్నీ నేను సూసుకుంటలే. మా తమ్ముని ఇంట్ల పడ్డంక. ఇగ అది ఏం చేస్తది. ఆ కులంగానోన్ని ఎట్ల కట్టుకుంటది?"

"ఆ.. జాగర్త.. మనకు బిడ్డకంటే కులం ముఖ్యం. చెప్పినట్లు వింటె విన్నది. లేకుంటె అది వాడిని చేసుకునుడుకల్ల - ఏం చేసుకుంటదో చేసుకోని.. ఉరి పెట్టుకుంటదా పెట్టుకోనీ!..."

రిక్షా గాంధీ బొమ్మ ముందు ఆగింది.

***

"వస్తావురా..."

"ఏడికి సార్..."

"అన్మకొండ..."

"అన్మకొండల ఏడికి పోవాలె?"

"ఏ.. గా అలంకార్ టాకీస్ సందులేదా?"

"ఆc ఆc.."

"గా సందుల్నే..."

తలూపాడు ధర్మయ్య

"ఏం తీసుకుంటవు?" అని అడిగాడు ఆ మీసాల ఆసామి.

"ఎందరు? ఇద్దరా"

"ఆఁ ఇద్దరమే."

"అయిదున్నర ఇయిండ్లి."

"సరె... ఇంకో పావుల ఎక్కువనే ఇస్తగాని జెర జల్దిన తీస్కపోవాలె.."

తలూపాడు ధర్మయ్య.

మీసాల ఆసామితో పాటు పాను నమిలే ఓ స్త్రీ వుంది.

ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు.

రిక్షా కదిలింది.

"ఇన్నవా జానకీబాయి?..."

"ఆఁ."

"ఆ షావుకారు బిడ్డకు ఓ మన్నెపోల్ల పోరనికి లింకు."

"ఆఁ ఆఁ"

"వాడు అది పరారయి ఎత్తుల ఉన్నరు."

"తండ్రి దాన్ని పట్నం పంపిస్తాండు. టేషన్ల షావుకారి టికెట్లు రిజర్వు చేయిస్తాంటే చూసినా".

"ఉహూఁ"

"నువ్వు ఆ మన్నెపోల్ల పోరడు పంపిన మనిషివని ఆ పోరిని నమ్మించి మెల్లగ ఆలేర్ల బండిదించు."

"ష్ ... మెల్లగ."

"మిగతా పనంతా మనోళ్లు చూసుకుంటరు."

"ఇంటికి పోయినంక మాట్లాడుకుందాం తీయి."

"సరె... అట్లనె. కాని పోరి బంగారం సుమా వొదులొద్దు."

"ఆఁ ఆఁ..."

***

"ఏం రా రిక్షా వొస్తావా?..."

"ఏడికి సార్?"

"రామన్నపేట గాంధీ బొమ్మ."

"వొస్త సార్."

"ఎంత?"

"ఏదో మీ దయ సార్ - మీకు తెల్వదా.."

"అది కాదురా ఇంతని చెప్పరాదూ?..

"నువ్వు ఆ అమ్మ ఇద్దరేనా సార్?..."

"ఆఁ"

"నాలుగు రూపాలియిండ్లి."

"నాలుగా!... ఇదిగో ఒకే మాట. మూడున్నర ఇస్తం -"

"సరే కూసోండ్లి సార్."

ఇద్దరూ కూర్చున్నారు.

రిక్షా కదిలింది.

"మొత్తానికి మన వీధిలోగమ్మత్తు కథే నడిచిందన్న మాట..." అని అడిగిందామె.

"ఆ... ఆ అమ్మాయి వందన,ఆమె ప్రేమించిన అబ్బాయి... ఇద్దరూ వెళ్ళి పోలీస్‌స్టేషన్లో రిపోర్టు చేసారట"

"ఏమని?"

"తాము ప్రేమించుకున్న విషయం అమ్మాయి తల్లిదండ్రులు కులభేదం చెప్పి పెళ్ళికి అడ్డుపడుతున్న సంగతి. అబ్బాయిని అంటరాని వాడని నానా దుర్భాషలాడటం గురించి చెప్పి అది మనరాజ్యాంగానికి, చట్టానికే ఒక సవాల్. మాకు రక్షణ కల్పించండి అని వేడుకున్నారట"

"గడుసు పిండాలే"

"తానే పోలీస్ రిపోర్టు ఇవ్వాలనుకున్న షావుకారి పోలీసులె తనను పట్టుకుపోవడానికి రావడంతో చెంబేలెత్తి పోయాడనుకో"

"తగిన శాస్తి జరిగింది"

"పోలీసులు ఓ సంఘ సంస్కర్తను పిలిపించి జరిగిందంతా చెప్పారట. ఆ సంస్కర్తగారు నడుం బిగించి గాంధీ బొమ్మముందు వాళ్లకు వివాహం జరిపించాడు. అప్పుడు షావుకారి ఏం చేసాడనుకున్నావు?"

"ఏం చేసాడు?..."

"ఏమీ చెయ్యలేదు. నలుగురితోపాటు తానూ నాలుగు అక్షింతలు వేసి పరువు దక్కించుకున్నాడు. మరో విషయం తెలుసా?"

"ఏ విషయం"

"వందనను ట్రేన్లో నుంచే ఎత్తుకుపోవాలని మీసాల అప్పలసామి ప్లాన్ వేసాడట..."

"నిజం?!!"

"ఆ... ఆ మధ్య వరంగల్‌లో నలుగురు అమ్మాయిలు తప్పిపోయారు చూడు. ఆ నలుగురిని తప్పించింది వాడేనట..."

"ఓరి నీ అమ్మ కడుపు..."

"ఆశ్చర్యమేమిటంటే..."

"ఊ..."

"ఇంత పకడ్బందీగా షావుకారు వేసిన ప్లాను, అప్పలసామి పన్నిన వల గురించి ముందుగానే వివేక్‌కు ఎలా తెలిపిందో?"

"అలా తెలియకపోతే ఘోరం జరిగిపోయేది కదూ?"

"వందన పట్నం కాదు. బొంబాయికి వెళ్ళేది. వివేక్‌కు ఆ విషయాలన్నీ ముందుగా తెలపడం వలన తన స్నేహితుల సహాయంతో తమ కథను సుఖాంతం చేసుకోగలిగాడు."

"అయితే ఈ వివరాలన్నీ వివేక్‌కు ఎలా తెలిసాయి?"

"అదే కదా నాకు అంతుపట్టనిది"

కోణార్క చిత్రంలో... సూర్యుని రథచక్రంలా వున్న రిక్షాచక్రం ముందుకు దూసుకు పోతున్నది.

*ఆంధ్రభూమి వీక్లీ, 29-12-1988*